కథ

# నీకో నమస్కారం

**"హలో గుడ్‌మాణింగ్!" విష్ చేస్తూ కేబిన్‌లోకి అడుగుపెట్టాడు అరుణ్.**

**"వెరీ గుడ్ మాణింగ్" ప్రతిగా విష్ చేస్తూ అతని మొహంకేసి చూశాను.**

**చిలిపిగా మీసాల క్రింద నుంచి నవ్వుతూ, ఎడ్మైరింగ్‌గా అద్భుతమైన వస్తువునేదో చూస్తున్నట్లున్న అతని చూపు..**

కొంచెం విసుగ్గా అన్పించింది. రిజిస్టర్‌లో సైన్ చేస్తూ నాకు మాత్రమే వినబడేటట్లు "పింక్ అందరికీ సూటవ్వదు. రియల్లీ! చెప్తే అబద్ధమనుకుంటారేమో- ఈ పింక్ శారీ మీకు సూటయినట్లు ప్రపంచంలో ఇంకెవ్వరికీ కాదు. టుడే యువార్ వెరీ బ్యూటిఫుల్" అంటూన్న అతని ధైర్యానికి కొంచెం ఆశ్చర్యపడుతూనే-

"స్టాప్ ద నాన్సెన్స్" అనకుండా ఉండలేకపోయాను. ఆశ్చర్యం ఎందుకంటే ఆఫీస్‌లో నేను లేడీబాస్‌ని అయితే అతను నా సబార్డినేట్. సెక్షనాఫీసర్‌ని రకరకాలుగా కాకాలుపట్టడం చూసాను. కానీ ఇలాంటి సీన్ నేన్నెడూ వినలేదు. సహజంగా మృదువుగా ఉండే నా స్వభావం అతనికి ఆ అవకాశం ఇచ్చిందేమో!

మొన్నటికి మొన్న "థర్టీ ప్లస్‌లోనే మీరింత అందంగా ఉంటే సిక్స్‌టీస్‌లో రోడ్డు మీద ఏక్సిడెంట్స్ అయిపోయేవేమో" అన్నాడు. దాన్ని కాంప్లిమెంట్ అనుకోవాలో, టీజింగ్ అనుకోవాలో తెలియక విస్తుపోయాను.

ప్రతిరోజూ వస్తూనే కళ్లనిండా చూడడం, అదోలా నవ్వడం, ఆర్తిగా మాట్లాడడం, ఫామిలీ విషయాలు అడుగుతూ ఉండడం- నా నుంచి ఎటువంటి ప్రతిస్పందనా లేకపోయినా అతను రోజూ అలాగే ప్రవర్తించడం చాలా ఇబ్బందిగా ఉంది.

"ఏమిటో ఈరోజు చాలా డల్‌గా, మూడీగా ఉన్నారు. ఏదైనా ఫామిలీ ప్రాబ్లమా?" అని అడిగే అతని ప్రశ్నలో నా కుటుంబ విషయాలు తెలుసుకోవాలన్న ఆరాటం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

"ఉదయాన్నే చాలా పెద్ద ఆలోచనలో మునిగిపోయారు. ఏదైనా ఆఫీస్ ప్రాబ్లెమా?" అబ్బ.. ఆడవాళ్లతో ఇంత పొలైట్‌గా మాట్లాడగల నేర్పు భగవంతుడు మగవాళ్లకే ఇచ్చాడు.

ఆ ప్రాబ్లమ్ మీతోనే అని చెప్పాలనుకుని కూడా "ప్లీజ్-గో అండ్ సెండ్ మిస్టర్ శర్మ" అంటూ పెన్ చేతిలోకి తీసుకున్నాను. కానీ ఏమీ చూడాలన్పించక కుర్చీలో వెనక్కి వాలి శర్మగారి కోసం ఎదురుచూస్తూ కళ్లు మూసుకున్నాను.

రెండు నెలలుగా అరుణ్ చేస్తున్న పనులు మళ్లీ గుర్తొచ్చాయి. నేను ప్రమోషన్ మీద ఈ ఆఫీసుకి సెక్షనాఫీసరుగా వచ్చి రెండు నెలలే అయింది. జాయినయిన రోజు ఇచ్చిన పార్టీలోనే కూల్‌డ్రింక్ తాగుతూ అరుణ్ నన్ను పదే పదే గుచ్చిగుచ్చి చూడడం గమనించాను. అప్పుడు పట్టించుకోలేదు కానీ పని కల్పించుకుని అదే పనిగా కేబిన్‌లోకి వస్తూ ఉండడం, మాట్లాడుతూనే అలా చూస్తూ ఉండిపోవడం ఇవన్నీ ఇబ్బందిగా ఉన్నా శృతిమించని అతని ప్రవర్తనని నేనేం కామెంట్ చెయ్యలేకపోయాను. బహుశా మనసు మూలల్లో ఎక్కడో కొంత అతిశయం కూడా ఉండవచ్చునేమో.

నా ఆలోచనలో నేనుండగానే మళ్లీ తలుపు తోసుకుని వచ్చాడు అతనే- "ఏమిటో చెప్పండి" అన్నాను కొంచెం సీరియస్‌గా- అతను నా ఎదురుగా సీటు లాక్కుని కూర్చుంటూ "అయిదు నిముషాలు నా కోసం స్పేర్ చెయ్యగలరా? ప్లీజ్ ఉషా" అన్నాడు అభ్యర్థనగా, నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే కుర్చీలో రిలాక్స్ అవుతూ.

"మీరు బాస్‌లా కాకుండా ఫ్రెండ్లీగా నా మాటలు రిసీవ్ చేసుకోండి. మిమ్మల్ని చూస్తే ఈరోజు నాకెందుకో మీతో నా స్నేహం జీవితాంతం కొనసాగితే బావుండునని అన్పిస్తోంది" అతని మాటలకు అడ్డుపడుతూ "మీరు కోరుకుంటున్నది ఏ రకమైన స్నేహం" కొంచెం కఠినంగానే అన్నాను. "మీరు నిజంగా నా వ్యక్తిత్వాన్ని బట్టి స్నేహం చెయ్యడానికి మీకు నా గురించి ఏమీ తెలీదు. కేవలం నా మొహం చూసి చేసే స్నేహాన్ని నేనంగీకరించను. అయినా ఇలాంటి ఇన్‌ఫాట్యుయేషన్స్‌లో ఇరుక్కోవడానికి టీనేజర్స్‌మీ కాదు మనం. బాధ్యతగల భర్త మీరు, పిల్లల తల్లిని నేను. దయచేసి మీరు చేయదల్చుకున్న కాలక్షేపానికి స్నేహం ముసుగు వెయ్యకండి. ప్లీజ్ గెటవుట్" అన్న మాటని గొంతులోనే అదిమిపెట్టడానికి చాలా ప్రయత్నం చెయ్యవలసి వచ్చింది.

నా మాటలకి ఏమీ సమాధానం చెప్పలేదు. వంచిన తల పైకెత్తలేదు. కళ్లమీద చేతులుంచుకుని అయిదు నిముషాలు అలాగే కూర్చుండిపోయాడు.


"మీకు తెలియని విషయం ఒకటుంది మేడమ్! నా భార్య, అనారోగ్యం, దాని ప్రవర్తన జీవితంలో నాకు అన్నీ ఉండి ఏమీ లేకుండా చేసాయి. ఇద్దరు పిల్లలు పుట్టాక తన మానసిక పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. రకరకాల వైద్యాలు చేయించినా మతిస్థిమితం రాలేదు. ఒక మంచి మాట, ఒక మంచి ఓదార్పు, ఒక చిరునవ్వుకి మొహం వాచిపోయాను-మీ రాకతో నా మనసులో ఏదో ఆశ చిగురించింది. అందుకే మీ స్నేహాన్ని అర్థించాను. మీరు అపార్థం చేసుకున్నారు. అయాం సారీ" అంటూ లేచి తలుపు తీసుకుని వెళ్లిపోయాడు.

ఏమిటీ మనిషి? తన కష్టాలన్నీ నాకు చెప్పుకుని ఏ రకం సహాయం నా నుంచి అర్థిస్తున్నాడు? నిజంగా స్నేహమా అంటే అది ఆపోజిట్ సెక్స్ మధ్య అంతగా సక్సెస్ అవ్వనిది. పైగా నేనేం ప్రక్కింటి, ముందింటి అమ్మాయినా స్నేహం చెయ్యడానికి. నాకేం తీరికా లేదు. మరి సానుభూతా..అంటే దానివలన తనకేమీ ఉపయోగం లేదు. మొదట్లో సానుభూతితో కూడిన స్నేహం. కొన్నాళ్లకి రూపాంతరం చెంది మరేదైనా కావచ్చు- 'ఓ! గాడ్' తల సన్నగా పోటు పెట్టడం మొదలైంది. 'కంప్లీట్ వేస్ట్ ఆఫ్ వన్ డే' అని గొణుక్కుంటూ హాఫ్‌డే లీవ్‌పెట్టి ఇంటికి బయల్దేరాను.

చలికాలపు మధ్యాహ్నం రోడ్డునిండా నిద్రగన్నేరు చెట్లు, నీరెండతో వాతావరణం ప్లెజెంట్‌గా ఉంది. ఆటో కోసం అటూ ఇటూ చూస్తూ నడుస్తుండగా రోడ్ క్రాస్ చేస్తూ కన్పించింది సుభాషిణి. తను తనేనా కాదా అన్న అనుమానంలో నేనుండగానే నన్ను చూసి దగ్గరగా వచ్చి కావలించుకున్నంత పని చేసింది "ఉషా! నిజంగా నువ్వేనా" అంటూ.

తను ఇంటర్, డిగ్రీ అయిదు సంవత్సరాలలో నా ప్రాణ స్నేహితురాలు- నేను ట్రాన్స్‌ఫర్ మీద ఈ ఊరొచ్చి రెండు నెలలే అయినందున తను ఇక్కడే ఉంటున్న సంగతి నాకు తెలీదు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కొంత దూరం నడిచాక మా ఇల్లు ఇక్కడే పదమంటూ బలవంతం చేసింది తను. నాకూ ఏమీ అభ్యంతరం కనబడలేదు.

హాలు తాళం తీసి ఎంటరవుతూనే నన్ను సోఫాలో కూలేసి, గల గలా మాట్లాడుతూ మేరేజ్ ఆల్బమ్ తెచ్చి నా చేతిలో పెట్టింది. బహుశా మేము చిన్నప్పుడు చెప్పుకున్న కబుర్లకి సరిపడే భర్తనే ఎన్నుకున్నానని చెప్పాలని తొందరేమో- ఫస్ట్ పేజీ త్రిప్పుతూనే నోటమాట రానట్లు కొయ్యబారిపోయాను నేను. ఫొటోలో దండలు, నుదుట కళ్యాణ తిలకంతో సుభాషిణి, అరుణ్. సుభాషిణి భర్తా అరుణ్! మరి తన భార్య గురించి చెప్పినది నిజమా? అబద్ధమా? ఈలోగా వెనుకనించి మెడచుట్టూ చేతులు వేసి "ఎలా ఉందోయ్-నా సెలక్షన్" అంటున్న సుభాషిణి గొంతులో గర్వాన్ని గుర్తించి "సుపర్బ్" అన్నాను.



ఎలాగో
నేరు పెగుల్చుకుని.

లెమన్ ఎల్లో శారీ, మేచింగ్ బ్లౌజు, తల్లో జాజి దండతో కావ్య నాయికలా ఉన్న సుభాషిణినా అరుణ్ మానసిక రోగి అన్నది అని ఆశ్చర్యపడ కుండా ఉండలేకపోయాను.

అయినా కన్ఫర్మ్ చేసుకోవడానికి "సుభా.. ఈమధ్య నీ ఆరోగ్యం ఎలా ఉందే" అన్నాను నెమ్మదిగా.

నా ప్రశ్నకి సమాధానంగా పకపకా నవ్వుతూ "పోవే పెద్ద ముసలమ్మలా జరీచీరా, కుశల ప్రశ్నలూ నువ్వూనూ. మీ ఆయన సంగతి చెప్పు. మీ పిల్లలు నీలా ఉంటారా?- మా అన్నయ్యలా ఉంటారా?- ఇన్నాళ్లకి కలిసావు అవన్నీ చెప్పక నా ఆరోగ్యం గురించి అడుగుతావేమిటే- చూస్తే తెలియడంలా నీకంటే వంద రెట్లు బెటర్" నిజంగానే దబ్బపండులా ఉన్న తన ముందు నేను కొంచెం నలిగిన పింక్ బెంగాల్ కాటన్ చీరలో తనకి అక్కయ్యలా ఉన్నాను.

"అబ్బబ్బ-నీ పరధ్యానం మాత్రం ఏమీ తగ్గలేదు. నీ ఆలోచనలూ నువ్వూనూ-రా- కిచెన్‌లోకి వెళ్దాం" అంటూ డైనింగ్ టేబుల్ కుర్చీ జరిపి "నీకిష్టం కదా- వేడి వేడి పకోడీలు-మసాలా టీ అయిదే అయిదు నిముషాల్లో చేసేస్తాను. ఏవైనా కబుర్లు చెప్పు" అని వద్దంటున్నా వినకుండా పాదరసంలా నేల మీద జారుతూ, ఇల్లంతా కలియతిరుగుతూ చకచకా పని చేస్తోంటే కూర్చుని చూడడానికి ముచ్చటగా అన్పించింది.

అప్పటికే వచ్చి రెండు గంటలైంది. బొట్టుపెట్టి పెద్ద కనకాంబరాలు దండ నా చేతిలో పెడుతున్న తన దగ్గర రేపు తప్పకుండా మా ఇంటికి వస్తానని మాట తీసుకున్నాను.

మర్నాడు సాయంత్రం పిల్లలకి కాన్వెంట్ డ్రెస్ మార్చి, పాలు అందించి, శ్రీవారికీ, నాకూ టీ కప్పులు తెచ్చి టేబుల్ మీద పెడుతుండగా కాలింగ్‌బెల్ మ్రోగింది. సుభాషిణి చెవిలో నవ్వుతూ ఏదో చెప్తున్న అరుణ్ తలుపు తీసిన నన్ను చూడగానే స్టన్ అయిపోయాడు. మొహంలో నవ్వు మాయమై అదోరకం భయం తొంగి చూసింది. నన్ను చూసి వెడల్పైన అతని కళ్లలో ఆ ఫీలింగ్ చూసి నాకు భలే సంతోషంగా అన్పించింది.

"ప్లీజ్ కమిన్ అరుణ్" అంటున్న నా మాటలకు షాకవడం ఈసారి సుభాషిణి వంతయింది.

ఈలోగా శ్రీవారు లేచి వచ్చి "హలో! అరుణ్- మీరు మా ఉష కొలీగ్- హలో! మీరు మా ఉష క్లోజెస్ట్ ఫ్రెండ్ సుభాషిణి. యామై కరెక్ట్..వెల్‌కమ్ టు అవర్ స్వీట్ హోమ్" అంటూ పజిల్ సాల్వ్ చేసేసారు.తర్వాత సుభాషిణి, అరుణ్ మా ఆఫీస్‌లోనే పనిచేస్తున్నట్లు చెప్పనందుకు కసిదీరా తిట్టింది. వైలెట్ కలర్ చుడీదార్, పోనీ టెయిల్‌తో పదేళ్ల వయసు తగ్గినట్లున్న నా మొహంకేసి అరుణ్ కళ్లెత్తి కూడా చూడకపోవడం నవ్వొచ్చింది. బహుశా భావకవిలా పైజమా, లాల్చీతో పీస్‌ఫుల్‌గా కన్పిస్తున్న శ్రీవారు నాకు సరైన జోడీయా కాదా అని అంచనా వేస్తూ ఉండవచ్చు. వాళ్ల పిల్లలూ, మా పిల్లలూ షటిల్ ఆడతామని సరదాపడితే మావారు అరుణ్‌ని కూడా కోర్టు దగ్గరకి తీసుకెళ్లారు. అంతకుముందే ప్రిపేర్ చేసిన ఆనియన్ వడ, కోల్డ్‌మిల్క్ సుభాషిణి కోర్టు దగ్గరే సర్వ్ చేసేసింది. ఆ సాయంత్రమంతా సుభాషిణీ, నేనూ చీరల కలక్షన్, వంటలు, అల్లికలు, పాత ఫ్రెండ్స్ గురించి చెప్పుకుంటూ హాయిగా కాలక్షేపం చేసాము. వెళ్తూ వెళ్తూ అరుణ్ గుడ్‌నైట్ బదులు రెండు చేతులూ ఎత్తి నమస్కారం అన్నాడు. రాజకీయనాయకుడిలా- ఆ నమస్కారం సుభాషిణికి తన సంగతి చెప్పనందుకా లేక 'నీకో నమస్కారం తల్లీ' అన్నాడో తేల్చుకోలేకపోయాను. పోనీ తర్వాత కూడా ఆ అవకాశం నాకివ్వకుండా అరుణ్ పదిహేనురోజులు మెడికల్ లీవ్ పెట్టి మరీ ట్రై చేసి వేరే బ్రాంచ్‌కి ట్రాన్స్ఫర్ మీద వెళ్లిపోయాడు. ఇంక ఆ నమస్కారం నాకేనని కన్ఫర్మ్ చేసుకుని నవ్వుకున్నాను. ✪

వాణీప్రభ